తొలి రోజు 99.72 శాతం హాజరు

- సజావుగా పదో తరగతి పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 68 పరీక్షా కేంద్రాల్లో 10,402 మందికి 10,373 మంది విద్యార్థులు హాజరు
- జిల్లా విద్యాధికారి రాధాకిషన్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 21: పదో తరగతి వార్షిక పరీక్షలు జిల్లాలో సజావుగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా 68 పరీక్షా కేంద్రాల్లో తొలి రోజు ప్రథమ భాష పరీక్షకు 10,402 మందికి 10,373 మంది విద్యార్థులు హాజరయ్యారు. 29 మంది గైర్హాజరయ్యారని డీఈవో రాధాకిషన్ తెలిపారు. 99.72 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రైవేట్ విద్యార్థులు 16 మందికి 14 మంది హాజరయ్యారు. తొలి రోజు పరీక్షకు విద్యార్థులు తల్లిదండ్రులు, బంధువులతో కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. కొల్చారం జడ్పీహెచ్ఎస్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతంతో పాటు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. శంకరంపేట(ఆర్), వెల్దుర్తి, శివ్వంపేట పరీక్షా కేంద్రాలను డీఈవో రాధాకిషన్ సందర్శించారు. మెదక్, హవేళీఘనపూర్, తూప్రాన్, మనోహరాబాద్, పాపన్నపేట, టేక్మాల్, అల్లాదుర్గం, శంకరంపేట(ఏ), రేగోడ్ మండలాల్లోని 24 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. జిల్లాలో ఎక్కడా డిబార్‌కు కానీ, మాల్‌ప్రాక్టీస్‌కు గానీ పాల్పడలేదు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతో ఇబ్బందులు ఏర్పడలేదు. ప్రతి కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

మెదక్ మున్సిపాలిటీ: కొల్చారంలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

రామాయంపేట: పట్టణంలోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

పరీక్షలు రాసే ఒక్కో విద్యార్థికి 24 పేజీలు

- చీఫ్ సూపరింటెండెంట్ శ్యామ్‌సుందరాచార్యులు

రామాయంపేట, మార్చి 21: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఒక్కొక్కరికి 24 పేజీలతో కూడిన బుక్‌లెట్ అందిస్తున్నట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ శ్యాంసుందరాచార్యులు తెలిపారు. శుక్రవారం తెలంగాణ గురుకుల విద్యాలయం పరీక్షా కేంద్రం వద్ద సందర్శించి విలేకరులతో మాట్లాడారు. ఈ కేంద్రంలో 196 మంది ఇంగ్లిష్ మీడియం, ఆరుగురు విద్యార్థులు తెలుగు మీడియంలో పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు.

చేగుంట: స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

చిలిపిచెడ్: సోమక్కపేటకు బస్సు రాకపోవడంతో ఆటోలో వెళ్తున్న పదో తరగతి విద్యార్థులు

విద్యార్థులకు ప్రయాణ ఇబ్బందులు

చిలిపిచెడ్, మార్చి 21: మండలంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు చిలిపిచెడ్‌లో పరీక్షా కేంద్రం ఉండడంతో బస్సులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ కేంద్రంలో సోమక్కపేట, ఫైజాబాద్, చండూర్, గౌతాపూర్, చిలిపిచెడ్ ఉన్నత పాఠశాలలకు చెందిన 196 మంది పరీక్షలు రాసేందుకు వస్తున్నారు. ప్రైవేట్ వాహనాలు, ఆటోల కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్టీసీ అధికారులు కొడిపల్లి నుంచి చిలిపిచెడ్, సోమక్కపేట, గౌతాపూర్, ఫైజాబాద్, అజ్జమర్రి గ్రామాలకు బస్సు నడిపితే ఇబ్బందులు తప్పుతాయని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నాసిరకం పనులపై చర్యలు తీసుకోవాలి

నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, మార్చి 21: పెద్దశంకరంపేటలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌరస్తా వరకు చేపట్టిన సీసీ రోడ్డు పనులు నాసిరకంగా ఉన్నాయని, ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శుక్రవారం అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.80 లక్షలతో ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు సరిగ్గా చేయకపోవడంతో సీసీ రోడ్డు కుంగిపోయిందన్నారు. దీంతో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయి లీకేజీ కారణంగా పలు కాలనీలకు తాగునీటి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని నాణ్యమైన రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంప పెట్టు

మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 21: మాజీ మంత్రి హరీశ్‌రావుపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు చేయించడాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కొట్టివేయడం ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మచ్చలేని మనిషి, నిజాయితీకి మారుపేరు అయిన హరీశ్‌రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం కేసు పెట్టడం ప్రభుత్వ దివాళా కోరుతనానికి నిదర్శనమన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కేస్తూ ప్రతిపక్షంపై తప్పుడు కేసులు బనాయిస్తున్న రేవంత్‌రెడ్డి సర్కార్ ఇప్పటికైన బుద్ధి తెచ్చుకోవాలన్నారు.

మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవు

తూకం యంత్రాలను పరిశీలిస్తున్న జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్

పాపన్నపేట, మార్చి 21: తూకాలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్ అన్నారు. శుక్రవారం పాపన్నపేట, టేక్మాల్ మండలాల రేషన్ దుకాణాల్లో తూకం యంత్రాలను పరిశీలించారు. వాటిని సరిచూసి స్టాంపింగ్ వేశారు. పాపన్నపేట మండలానికి చెందిన 30, టేక్మాల్ మండలానికి చెందిన 20 తూకం యంత్రాలకు స్టాంపింగ్ చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా తూకాల్లో మోసానికి పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రేషన్ డీలర్లు శ్రీనివాస్, కిష్టయ్య, రాజ్‌కుమార్, మనోహర్, శంకరయ్య తదితరులు ఉన్నారు.

చెరువు నీటిని తోడేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నార్లపూర్ హైదర్ చెరువు ఆయకట్టు రైతులు

నిజాంపేట, మార్చి 21: చెరువు నీటిని తోడేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నార్లాపూర్ హైదర్ చెరువు ఆయకట్టు రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీకి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు మాట్లాడుతూ చెరువు కింద దాదాపు 400 ఎకరాల మేర వరి పంటను పండిస్తున్నామన్నారు. ఈ క్రమంలో నార్లపూర్ గ్రామానికి చెందిన పెద్ద అంజయ్య, శ్రీశైలం, భిక్షపతి హైదర్ చెరువులో జేసీబీతో కాల్వలు తీసి, మోటర్లు వేసి దొంగతనంగా నీటిని తోడేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి, రైతులు రవీందర్‌రెడ్డి, శివకుమార్, నాగరాజు, సురేశ్, చంద్రం, భూదయ్య, నరేశ్, రాజయ్య, పరశురాములు, బాలయ్య తదితరులు ఉన్నారు.

ఫార్మా పరిశ్రమ నిర్మాణానికి అనుమతి ఇవ్వద్దు

ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న చందంపేట గ్రామస్తులు

చిన్నశంకరంపేట, మార్చి 21: చందంపేట గ్రామశివారులో ఫార్మా పరిశ్రమ నిర్మాణానికి అనుమతి ఇవ్వద్దని గ్రామస్తులు ఎంపీడీవో దామోదర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. శుక్రవారం చందంపేట గ్రామస్తులు గ్రామ సభ నిర్వహించారు. గ్రామ శివారులో నిర్మించనున్న ఫార్మా పరిశ్రమ నిర్మాణానికి అనుమతి ఇవ్వద్దని తీర్మానించారు. ఉన్న పరిశ్రమలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఫార్మా పరిశ్రమ నిర్మాణానికి అనుమతిస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

చండూర్ ఎత్తిపోతలపై గ్రామసభ

చండూర్ లిఫ్ట్‌పై గ్రామసభలో చర్చిస్తున్న గ్రామస్తులు

చిలిపిచెడ్, మార్చి 21: చండూర్ శివారులో మంజీరా నది వద్ద ఉన్న ఎత్తిపోతల (లిఫ్ట్)ను ముళ్లపొదలు కప్పేశాయి. దీంతో లిఫ్ట్‌కు వెళ్లే రోడ్డు, ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. గ్రామస్తులు కలెక్టర్, ఎమ్మెల్యే, ఇరిగేషన్ డీఈలకు వినతి పత్రాలు అందజేశారు. వారం రోజుల కింద ఇరిగేషన్ అధికారులు వచ్చి లిఫ్ట్‌ను పరిశీలించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సభలో రైతులు అందరూ కలిసి ఎకరాకు రూ.5 వేల నుంచి 8వేల వరకు ఇస్తామని తెలిపారు. దీంతో మట్టిరోడ్డు వేసి త్వరగా లిఫ్ట్‌కు మరమ్మతులు చేసి చెరువు, కుంటలు నింపాలని గ్రామసభలో తీర్మానించారు. సభలో రైతులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, శేషాద్రి, రాజ్‌కుమార్, విష్ణు, రాకేశ్‌నాయక్, శ్రీహరి, శ్రీకాంత్‌రెడ్డి, టోప్యానాయక్, శ్రీనివాస్, భూమయ్య, రామకృష్ణయ్య, వెంకట్ సత్యనారాయణ, వెంకటేశ్, యాదగిరి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

టేక్మాల్, మార్చి 21: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ తులసీరాం పంపిణీ చేశారు. ఆర్‌ఐ సాయిశ్రీకాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ ఉన్నారు.

రేగోడ్‌లో..

రేగోడ్, మార్చి 21: మంత్రి దామోదర్ ఆదేశాల మేరకు 18 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ దత్తారెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు.

ఆలయాలకు పెద్దపీట వేసింది కేసీఆరే

రామాయంపేట: పద్మాదేవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న పెద్దమ్మ ఆలయ కమిటీ సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ: సోహేల్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

- ఊరూరికి నిధులు మంజూరు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఆరు గ్యారెంటీల అమలు ఎక్కడ?
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట, మార్చి 21: రాష్ట్రంలో ఆలయాలకు పెద్దపీట వేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామాయంపేటకు విచ్చేసిన ఆమె పెద్దమ్మ ఆలయానికి చేరుకుని పెద్దమ్మ, పెద్దిరాజులకు పూజలు చేసి కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ అధినేత వందల కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకుని, గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో రామాయంపేట పీఏసీఎస్ అధ్యక్షుడు బాదె చంద్రం, మాజీ ఎంపీటీసీ ఎస్‌కే హైమద్ ఉన్నారు.

అభయాంజనేయ స్వామికి పూజలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 21: జిల్లా కేంద్రంలోని 13వ వార్డులో అభయాంజనేయ స్వామిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ జడ్పీ ఉపాధ్యక్షురాలుతో కలిసి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మనుమడి రెండో పుట్టిన రోజు సందర్భంగా ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కో కన్వీనర్లు గడ్డమీది కృష్ణాగౌడ్, లింగారెడ్డి, మాజీ కౌన్సిలర్లు సులోచన ప్రభురెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, జయరాజ్ బీఆర్ఎస్ నాయకులు ప్రభురెడ్డి, మధు, జుబేర్, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ కౌన్సిలర్ పుట్టినరోజు

మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సోహెల్ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సోహెల్‌ను సత్కరించి, జన్మదిన శుభకాంక్షలు తెలిపారు. మాజీ కౌన్సిలర్లు ఆర్‌కె శ్రీనివాస్, మధు, పేర్క కిషన్, సాధిక్, నాయకులు జుబేర్, ఫాజిల్, ఇస్మాయిల్, అజ్గర్‌అలీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనారోగ్యం బారిన పడడంతో ఇటీవలే సర్జరీ చేయించుకున్న మెదక్‌కు చెందిన ముస్లిం మత పెద్ద ఆరీఫ్‌ను పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. అతడి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

మినీ గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 21: మెదక్‌లోని గిరిజన సంక్షేమ మినీ గురుకులంలో కుక్, పీఈటీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మెదక్ మండలంలో విద్యాభ్యాసం చేసిన ఎస్టీ (మహిళ) అభ్యర్థులు ఈనెల 27లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. కుక్ పోస్టుకు పదో తరగతి, పీఈటీ పోస్టుకు బీపీఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఇది తాత్కాలిక పద్ధతిన జరిగే నియామకాలన్నారు. కుక్ పోస్టుకు రూ.9,750, పీఈటీకి రూ.14,300 వేతనం ఉంటుంద పేర్కొన్నారు.

నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి కార్యశాల

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 21: నేడు మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక రోజు రాష్ట్రస్థాయి కార్యశాలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో హెర్బేరియం తయారీ, నిల్వ చేయు విధానం అనే అంశంపై రాష్ట్రీయ ఉచిత ఉచితార్ శిక్షా అభియాన్ వారి ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యశాలలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ లింక్ ద్వారా లేదా కళాశాలలో పేరు నమోదు చేసుకున్న ఉపన్యాసకులు, విద్యార్థులు ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని తెలిపారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

పాపన్నపేట, మార్చి 21: ఎండిన పంటలకు పరిహారం అందించాలని సీపీఎం మండల నాయకుడు అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బాచారంలో వరి పంటను పరిశీలించారు. ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో బోరు బావుల్లో నీరు అడుగంటి పోయి చేతికొచ్చిన పంట ఎండిపోతున్నదన్నారు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.40 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నిజాంపేట, మార్చి 21: చల్మెడలో రూ.10 లక్షల వ్యయంతో మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి, శౌకత్‌పల్లిలో రూ.20 లక్షల వ్యయంతో సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు అమరసేనారెడ్డి సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు.

ఈతకు వెళ్లి బాలుడు మృతి

రిత్విక్ (ఫైల్)

రామాయంపేట, మార్చి 21: ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన ఘటన రామాయంపేట మండలం కాట్రియాలలోని కొంచెరువులో శుక్రవారం చోటు చేసుకుంది. రామాయంపేట పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాసు రిత్విక్(12) తన స్నేహితులతో మధ్యాహ్నం రెండు గంటలకు స్కూల్ విడువగానే స్నేహితులతో కలిసి రిత్విక్ చెరువులో ఈతకు వెళ్లాడు. చెరువులో దూకడంతోనే బాలుడు రిత్విక్ పైకి రాలేదు. మిగతా మిత్రులకు ఈత రావడంతో పైకి వచ్చారు. రిత్విక్ మాత్రం చెరువులోనే మునిగిపోవడంతో గల్లంతయ్యాడు. వెంటనే విషయం తెలుసుకున్న గ్రామస్తులు, బాలుడి తండ్రి కాసు రాజు చెరువు వద్దకు వెళ్లి గజ ఈతగాళ్లతో చెరువులో గాలించాడు. మృతుడు రిత్విక్ మృతదేహాన్ని ఈతగాళ్లు పైకి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్సై బాలరాజు ఘటనా స్థలానికి వెళ్లి బాలుడి మృతదేహాన్ని పంచనామా నిర్వహించారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గూడురులో వ్యక్తి ఆత్మహత్య

మల్లేశ్‌యాదవ్ (ఫైల్)

శివ్వంపేట, మార్చి 21: మండలంలోని గూడురు గ్రామ శివారులో ఓ వ్యక్తి ఐదు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని మల్లేశ్‌యాదవ్ (43) రోజువారి కూలీ చేస్తూ మద్యానికి బానిసయ్యాడు. ఐదు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి రాకపోవడంతో గురువారం కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామశివారులోని ఖబ్రస్థాన్‌లో చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు చూసి కుటుంబీకులకు, పోలీసులకు తెలిపారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ దవాఖానకు తరలించారు.

కొల్చారం ఎంపీడీవోగా రఫిక్ ఉన్నీసా



కొల్చారం, మార్చి 21: కొల్చారం ఎంపీడీవోగా రఫిక్ ఉన్నీసా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చిన్న శంకరంపేటలో విధులు నిర్వహిస్తున్న రఫిక్ ఉన్నీసా డిప్యుటేషన్‌పై కొల్చారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న కలెక్టర్

నిబంధనలు పకడ్బందీగా అమలుచేయాలి

కొల్చారం, మార్చి 21: పరీక్ష నిర్వహణలో నిబంధనలను పకడ్బందీగా అమలుచేయాలని అధికారులకు కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శుక్రవారం కొల్చారంలోని జడ్పీ హెచ్ఎస్‌లోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేంద్రాల్లో భద్రత, పర్యవేక్షణ, విద్యార్థులకు తాగునీరు, లైటింగ్, ఫర్నిచర్, సదుపాయాల ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రోజు జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు వివిధ కారణాలతో 29 మంది విద్యార్థులు హాజరు కాలేదని తెలిపారు . ఆయన వెంట అధికారులు ఉన్నారు.

కొల్చారంలో తైబజార్‌వేలం

కొల్చారం, మార్చి 21: కొల్చారం గ్రామస్తుల సమక్షంలో తైబజార్‌ను శుక్రవారం వేలం నిర్వహించారు. ఎంపీడీవో కృష్ణవేణి పర్యవేక్షణలో పంచాయతీ సెక్రెటరీ అంజయ్య ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా, గ్రామానికి చెందిన బేగరి నరేశ్ రూ.61వేలకు వేలం దక్కించుకున్నాడు. కరెంట్ రాజాగౌడ్, దేవన్నగారి శేఖర్, కారోబార్ ప్రభాకర్, సొసైటీ మాజీ చైర్మన్ మనోహర్, సార సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనానికి నిప్పు పెట్టిన వ్యక్తి

టేక్మాల్, మార్చి 21: మద్యం మత్తులో ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టిన ఘటన టేక్మాల్‌లో చోటుచేసుకుంది. రంగన్నపల్లె గ్రామానికి చెందిన రమేశ్ టేక్మాల్‌లో మద్యం తాగాడు. అనంతరం మత్తులో అతను వైన్స్ ముందు ఆపి ఉంచిన తన ద్విచక్రవాహనం టీవీఎస్ ఎక్సెల్‌కు నిప్పుపెట్టారు. ఇది గమనించిన అక్కడివారు వాహనాన్ని జన సముదాయానికి దూరంగా తీసుకెళ్లి మంటలు ఆర్పారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కొడిపల్లి, మార్చి 21: సైబర్ మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని, వారి ఉచ్చులో పడి మోసపోవద్దని కొడిపల్లి ఎస్సై రంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తునికి రామానాయుడు పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా 5వ రోజు సంగారెడ్డి జిల్లా కంది అగ్రికల్చర్ విద్యార్థులు డా.రామానాయుడు పాలిటెక్నిక్ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ సొసైటీలో జరిగే మోసా లు బ్యాంకింగ్, ఫోన్‌కాల్స్, బెట్టింగ్ యాప్స్ గురించి అవగాహన కల్పించారు. తెలియని లింక్‌లను ఓపెన్ చేయకూడదని, అలాంటి వాటిపై ఎవరైనా ఫోన్ చేస్తే భయపడకూడదని తెలిపారు. వీటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డా.హరి, డా.రమేశ్, విద్యార్థులు గోపి కృష్ణ, స్వాతి, ప్రిన్సీ, అభిషేక్, నిఖిత, పూజిత పలువురు ఉన్నారు.

అసంఘటితరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శివ్వంపేటలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడిని అరెస్టు చేసిన పోలీసులు

రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో మత్స్యకార్మికులు

శివ్వంపేట, మార్చి 21 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, గద్దెనెక్కి పట్టించుకోవడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ధర్నా చేయడానికి వెళ్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, జిల్లా వ్యాప్తంగా అరెస్టు చేసిన సీఐటీయూ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటితరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించేవరకు ఉద్యమాలు ఆపమని ఆయన హెచ్చరించారు.

మత్స్యకారుల ముందస్తు అరెస్టు

రామాయంపేట, మార్చి 21: సమస్యల పరిష్కారం కోసం మత్స్యకారులు హైదరాబాద్ వెళ్తుంటే పోలీసులు అడ్డుకుని శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ సమస్యల పరిష్కారానికి తాము వెళ్తుంటే తమను అరెస్టు చేయడం పద్ధతి కాదని మత్స్యకారులు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చేగుంట, మార్చి 21: చేగుంటకు చెందిన సఫాయి కార్మికుడు ఎర్ర రమేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించి 50 కిలోల బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో ముత్యాలు, భాస్కర్, అమర్‌నాథ్, జనార్దన్‌గౌడ్, శ్రీను ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-AII
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.